రాజీపడితే ప్రశాంత జీవితం


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: క్షణికావేశంతో కేసుల్లో ఇరుక్కొని పోలీసు స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగితే జీవితంలో విలువైన సమయం, డబ్బు కోల్పోవడమే కాకుండా మానసికంగా ఇబ్బందులు వస్తాయని, ఒకరితో ఒకరు స్నేహ పూర్వకంగా రాజీ కుదుర్చుకుంటే ప్రశాంతంగా జీవించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణబాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధి కార సంస్థ ఆధ్వర్యంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. అనవసర కేసుల్లో చిక్కుకొని ఇబ్బంది పడుతున్న వారికి ఉచితంగా న్యాయం అందించడానికి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కార మార్గం ఉంటుందని, రాజీపడితే ఎలాంటి వివాదాలు ఉండవని పేర్కొన్నారు. జిల్లాలోని మూడు కోర్టుల్లో నాలుగు బెంచీల ద్వారా లోక్ అదాలత్ కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుంటే నేరాల సంఖ్య పూర్తిగా తగ్గుతుందన్నారు. ప్రతి వ్యక్తి పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కే. జయరాంరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రాంచంద్రారావు, అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి అఖిల, జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీవన శైలి.. లయ తప్పొద్దు

నేడు ప్రపంచ హృదయ వ్యాధుల నివారణ దినం


ఆదివారం ప్రత్యేకం

గుండె జబ్బులు వచ్చిన తర్వాత పరుగులు తీయడమే తప్ప అవి రాకుండా నివారించే విధానాలపై చాలామంది ఆసక్తి చూపడం లేదు. ఈ కారణంగానే గుండెపోటుకు గురయ్యే వారి సంఖ్య పెరిగిపోతోంది. గుండె శస్త్రచికిత్సల సంఖ్య పెరుగుతోంది. ఈ పరిస్థితికి తావులేకుండా జీవన శైలిలో మార్పులతో ప్రకృతితో కలిసి జీవనం సాగించడం ద్వారా గుండెను జీవితాంతం సురక్షితంగా ఉంచుకోవచ్చని ప్రకృతి వైద్యులు సూచిస్తున్నారు. నిత్య వ్యాయామంతో బరువు నియంత్రణలో ఉంచుకోవడంతో పాటు కొవ్వును కరిగించే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నేడు ప్రపంచ గుండె వ్యాధుల నివారణ దినం సందర్భంగా కథనం..

–న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి

నేడు కేఎంసీలో అవగాహన

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆదివారం వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలోని ఎన్ఆర్ఐ భవన్‌లో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రామక శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు వివిధ వర్గాల వారికి అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు.



తృణధాన్యాలు

కొర్రలు, సజ్జలు, జొన్నలు, బ్రౌన్ రైస్, ఓట్స్ వంటివి తీసుకోవాలి. బార్లీ, బీన్స్, కాయ ధాన్యాలు, శనగలు, చిక్కుళ్లు ఎక్కువగా తినాలి. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి.. రక్తంలో చక్కెరను నియంత్రిస్తాయి.



ఆకు, కాయగూరలు

బచ్చలికూర, కాలీఫ్లవర్, టమాట, క్యాబేజీ, క్యారెట్, పాలకూర, వంటి తాజా కూరగాయల్లో విటమిన్లు, ఖనిజాలు, పీచుపదార్థాలు సహా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. బరువును నియంత్రించడానికి సహాయపడతాయి.

వ్యాయామం అవసరమే

శరీర వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలి. నిపుణుల పర్యవేక్షణలో యోగా చేయడం ద్వారా అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. గుండెకు మేలు చేస్తుంది.



బెర్రీలు

స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్బెర్రీలు వంటివి యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్‌తో నిండి ఉంటాయి. ఇవి ఆక్సీకరణ, ఒత్తిడి, వాపు, గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారిస్తాయి. సి విటమిన్ అధికంగా ఉండే పండ్లు తీసుకోవాలి.

గ్రీన్ టీ

యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. జీవక్రియను పెంచడం, శరీర కొవ్వును నియంత్రించడం, ఇన్సులిన్ సెన్సిటివ్ మెరుగుపర్చి బరువును నియంత్రిస్తుంది.



చేపలు, నూనెలు

మాకేరెల్, సార్డినెస్, ట్యూనా వంటి చేపల్లో ఉండే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ట్రైగ్లిజరైడ్‌లు మంటను తగ్గిస్తాయి. గుండె లయను మెరుగుపరుస్తాయి.

వెల్లుల్లి

రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. ప్రతి రోజు 1-2 గ్రాముల వెల్లుల్లి దంచి పాలలో వేసి మరిగించి తాగడంతో గుండెకు బలంతో పాటు, చర్మరోగాలు, కీళ్లనొప్పులు తగ్గుతాయి.



వాల్‌నట్‌లు

వాల్‌నట్‌లు, బాదం, పిస్తా, గుమ్మడి, పొద్దుతిరుగుడు గింజలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ఫైబర్, పొటాషియమం, మెగ్నీషియం లభిస్తాయి. అవిసె గింజల్లో ఉండే ఫైబర్, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ కొలెస్ట్రాల్, మంటను తగ్గిస్తాయి.

ప్రకృతి జీవన విధానాన్ని అనుసరిస్తున్నా..

- అచ్చ వినోద్‌కుమార్, విద్యానగర్ కాలనీ, వరంగల్



గుండె సంబంధిత సమస్య రాగానే ఓ పెద్ద ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకున్నాను. మా కూతురు ప్రకృతి వైద్యురాలు కావడంతో నా జీవన విధానం, ఆహార అలవాట్లను మార్చేసింది. తృణ ధాన్యాలు, పిస్తా, బాదం, వాల్‌నట్, చిక్కుళ్లు ఉండేలా చూస్తాను. అన్నం, చక్కెర, ఉప్పు పూర్తిగా తగ్గించాను. ఇప్పుడు ఎలాంటి సమస్యలు లేవు.

పూర్వీకుల నుంచి నేర్చుకోవాలి..

- డాక్టర్ మైదం రాజు, ఆయుష్ వైద్యులు



మన పూర్వీకుల ప్రకృతి జీవన విధానానికి మనం దూరంగా ఉండటం వల్లనే గుండె జబ్బులు వస్తున్నాయి. మంచి ఆహారం, నిద్ర అవసరం. ఆందోళన, ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఉప్పు, చక్కెర, వరి అన్నం వదిలి తృణ ధాన్యాలు తీసుకోవాలి, ధ్యానం, యోగాసనాల ద్వారా గుండె జబ్బుల నుంచి బయటపడొచ్చు.


కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో గుండె వైద్యం కోసం వరుస కట్టిన రోగులు

కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో జనవరి నుంచి ఇప్పటివరకు చికిత్స వివరాలు	కార్డియాలజీ ఓపీ	యాంజియోగ్రామ్	స్టంట్లు	2డి ఏకో పరీక్షలు	ఈసీజీ పరీక్షలు
	25,444	634	212	22,980	16,522

జిల్లాలో 2.90 లక్షల మంది ఓటర్లు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఓటరు తుది జాబితాను శనివారం జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు విడుదల చేశారు. అందులో భాగంగా జిల్లాలో 2.90 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలోని 11 మండలాలోని 240 గ్రామ పంచాయతీలకు గాను 2044 వార్డులలో 290663 ఓటర్లు ఉన్నారు.


కాటారం: అంబట్‌పల్లిలో జాబితా ప్రదర్శన

మండలాల వారీగా వివరాలు..	గ్రామ పంచాయతీలు	వార్డులు	మొత్తం ఓటర్లు
భూపాలపల్లి	26	216	29933
చిట్యాల	24	204	28426
గణపురం	17	158	32511
కాటారం	24	210	30097
మహదేవపూర్	18	162	24820
మల్హర్‌రావు	15	128	21960
మొగుళ్లపల్లి	26	212	30287
మహాముత్తారం	24	196	20378
పలిమెల	8	62	5465
రేగొండ	35	314	46968
టేకుమట్ల	23	182	19818

నదీ ప్రవాహ ప్రాంతం... గంగాధరుడి నివాసం


పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ అర్చకులు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: నదీ ప్రవాహం గంగాధరుడి నివాసమని గన్నవరం భువనేశ్వరీ పీఠాధిపతి శ్రీ కమలానంద భారతి స్వామి అభిప్రాయపడ్డారు. ఆయన శనివారం కాళేశ్వరం రావడంతో ఆలయ పర్యవేక్షకులు బుర్రిశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ద్విలింగాలకు జలాభిషేకం నిర్వహించారు. పార్వతీ ఆలయంలో ఆయన అర్చకులను, భక్తులను ఆశీర్వదించారు. భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. హిందూమతాన్ని పెంపొందించాల్సిన ఆవశ్యకత అర్చకులు, పండితులపై ఆధారపడి ఉందన్నారు. దక్షిణ కాశీగా కాళేశ్వరానికి గొప్ప పేరుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కామిడి శ్రీనివాసరెడ్డి, లేతకరి రాజబాపు పాల్గొన్నారు.

నిధులు పారినా.. నీళ్లు రాలే!

న్యూస్‌టుడే, టేకుమట్ల : జిల్లాలోని చలివాగు, మోరంచ, మానేరు, బొగ్గుల, పెద్దవాగులో ప్రవాహానికి అడ్డుకట్ట వేసి భూగర్భ జలాలను పెంచేందుకు గతంలో పలు చోట్ల చెక్‌డ్యాంలు నిర్మించారు. వాటితో ఉపయోగం కంటే నష్టాలే ఎక్కువ ఉన్నాయి. డిజైన్లు, నాణ్యత, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. నిర్మించిన కొన్నేళ్లకే ధ్వంసమవుతున్నాయి. కొన్ని పనులు నేటికి పూర్తికాక అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అస్తవ్యస్తంగా మారిన చెక్ డ్యాంలపై 'న్యూస్‌టుడే' అందిస్తున్న పరిశీలన కథనం.

పరిశీలన



నిరుపయోగంగా షట్లర్ల నిర్మాణం..

మొగుళ్లపల్లి మండల కేంద్రం-ములకలపల్లి మధ్యలోని పెద్ద వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం ప్లానింగ్‌కే పరిమితమైంది. చెక్‌డ్యాం నుంచి నీటిని టేకుమట్ల మండలంలోని పలు గ్రామాలకు కాలువల ద్వారా అందించేందుకు చెక్‌డ్యాంకు షెట్టర్లు బిగించలేదు. నిర్మాణం నిరుపయోగంగా మారింది. చెక్‌డ్యాంకు ఇసుక మేటలు వేయడంతో నీటి సామర్థ్యం తగ్గుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



అన్నదాతల అసంతృప్తి

ఇది టేకుమట్ల మండలం వెలిశాల- గుమ్మడవెల్లి గ్రామాల మధ్యలోని చలివాగుపై నిర్మించిన చెక్‌డ్యాం. రెండేళ్ల క్రితం ఈ నిర్మాణం పూర్తి చేశారు. ఇది ఎందుకు పనికి రాకుండా పోయిందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజైన్ లోపం కారణంగా మూలమలుపుపై నిర్మించడంతో గుమ్మడవెల్లి వైపు ఇసుక మేటలు వేస్తోంది. వెలిశాల వైపు వంపుగా ఉండడంతో వాగు ప్రవాహం పంట భూములపై వెళ్తుంది. దీంతో మూడేళ్లుగా వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయని, ఎత్తయిన మట్టికట్టలు నిర్మించాలని కోరుతున్నారు.

ఇసుకమేటలతో తప్పని తిప్పలు..



చెక్‌డ్యాం నిర్మాణం వద్ద మాట్లాడుతున్న ఈ రైతులకు మల్హర్ మండలం చిన్నతుండ్ల అరేవాగు సమీపంలోని వ్యవసాయ భూములు ఉన్నాయి. చిన్నతుండ్ల ఆరేవాగుపై రెండేళ్ల క్రితం నిర్మించిన చెక్‌డ్యాంకు ఇరువైపులా ఎతైన మట్టికట్టలు నిర్మించకపోవడంతో చుట్టుపక్కల రైతుల భూముల మీదుగా వరద వెళ్తూ పంటలపై ఇసుక మేటలు కప్పుతున్నాయి. దీంతో వాటిని తొలగించేందుకు ఆర్థికంగా చాలా నష్టపోతున్నామని మట్టికట్టలను నిర్మించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.



అనుబంధ పనులు పూర్తికాక..

ఈ చెక్‌డ్యాం కాటారం మండలం కటుకుపల్లిలోనిది. కటుకుపల్లి, చింతకాని సమీపంలోని పెద్ద వాగుపై నిర్మాణం చేపట్టారు. ఏడాదిగా పనులు నిలిచిపోయాయి. మట్టికట్ట, అనుబంధ పనులు ఇంకా పూర్తి చేయలేదు. వరద ఉధృతికి పరివాహక వ్యవసాయ భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా స్పందించి మిగిలిన పనులను పూర్తి చేయాలి.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తాం..

- ప్రసాద్, డీఈ, జలవనరుల శాఖ, భూపాలపల్లి

భూపాలపల్లి నియోజకవర్గంలో 5 ఏళ్ల క్రితం పది చెక్‌డ్యాంలు మంజూరయ్యాయి. నిర్మాణాలు పూర్తి చేశారు. నిర్మాణాలకు ఇరువైపులా వరద రాకుండా ఎత్తుగా మట్టికట్టలు నిర్మించాల్సి ఉండగా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. కొన్నిచోట్ల పోసిన మట్టి వరదకు కొట్టుకుపోయింది. నిర్మాణాలు పూర్తిచేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి : సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉచితంగా నిర్వహించే వృత్తి విద్య కోర్సులకు ఆసక్తి గల మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సింగరేణి అధికార ప్రతినిధి కె.మారుతి తెలిపారు. టైలరింగ్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్ వర్క్, డీటీపీ, బ్యూటీషియన్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. పదో తరగతి ధ్రువపత్రం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో వచ్చే నెల 7 లోపు సింగరేణి పర్సనల్ విభాగంలో అందజేయాలన్నారు.

చిన్న కాళేశ్వరంతో సస్యశ్యామలం


బొగ్గులవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, అధికారులు

మల్హర్, న్యూస్‌టుడే: చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుతో మల్హర్ మండలం సస్యశ్యామలం కానున్నట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఆయన రుద్రారం, తాడిచెర్లలో పర్యటించారు. బొగ్గులవాగు ప్రాజెక్టు, రుద్రారం ఊరు చెరువు, పాఠశాలలను సందర్శించారు. ఊరచెరువు విస్తరణ పనులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఊర చెరువు నుంచి మధ్యతరహా బొగ్గులవాగు ప్రాజెక్టులోకి నీరు మళ్లింపు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. తాడిచెర్ల జెన్‌కో ఉపరితల గనిని సందర్శించి బొగ్గు ఉత్పత్తి, కన్వేయర్ బెల్ట్ నిర్మాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 68 కి.మీ బొగ్గు రవాణా చేస్తున్నామని, 17.2 కి.మీ కన్వేయర్ బెల్ట్ నిర్మిస్తే దూరభారం తగ్గనుందని అధికారులు వివరించారు. తాడిచెర్లలో భూనిర్వాసితుల పునరావాస స్థలాన్ని పరిశీలించారు. తాడిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరమ్మతు నిర్వహణ, సిమెంట్ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య, సీఈ సిద్ధయ్య, నీటిపారుదల శాఖ ఈఈ యాదగిరి, తహసీల్దార్ రవికుమార్, ఏఎమ్మార్ అధికారులు పాల్గొన్నారు.

1న డీఈఈ సెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఈఈ సెట్-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన అక్టోబర్ 1న డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ప్రీ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గతంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని వారు మాత్రమే పాల్గొనాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90304 92595 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రస్థాయి శనివారం ప్రారంభమయ్యాయి. వరంగల్ నగర శివారులోని మొగిలిచర్ల మైదానంలో నిర్వహిస్తున్న అండర్-19 క్రికెట్ పోటీలను కుడా(కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ) ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓరుగల్లు కేంద్రంగా 'కుడా' ఆధ్వర్యంలో క్రికెట్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పూల్ 'ఏ'లో వరంగల్, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల జట్లు, పూల్ 'బీ'లో ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 30 వరకు పూల్ ఏ, అక్టోబరు 1 నుంచి 3 వరకు పూల్ బీ జట్లు లీగ్, నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఆడుతాయన్నారు. అక్టోబరు 4, 5 తేదీల్లో సెమీస్, ఫైనల్స్ ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం ప్రతినిధులు ఉపేందర్, ఖాజా, రాము, కుమార్, మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు, ప్రభాకర్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

తొలి మ్యాచ్‌లో ఓటమి: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు 34.5 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో అహ్మద్ 38 పరుగులు చేశాడు. ఛేదనలో వరంగల్ జట్టు 29.4 ఓవర్లలో 87 పరుగులకు కుప్పకూలింది. 34 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. మహబూబ్‌నగర్ బౌలర్ ముకేత్ 3 వికెట్లు, అహ్మద్ 2 వికెట్లు తీశారు.



క్రికెటర్ల పరిచయ కార్యక్రమంలో 'కుడా' ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి


5 వికెట్ల తేడాతో నల్గొండ విజయం: కోమటిపల్లి క్రికెట్ మైదానంలో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 21.2 ఓవర్లలో 53 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ జట్టు 13.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసి విజయం సాధించింది. విష్ణువర్ధన్ 37 పరుగులతో పాటు 3 వికెట్లు తీసి రాణించాడు.

నేటి మ్యాచ్‌లు

29న వరంగల్ X మెదక్
(మొగిలిచర్ల మైదానం),
నల్గొండ X మహబూబ్‌నగర్
(కోమటిపల్లి మైదానం)

అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు మేరు/దర్జి కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి, వరంగల్ మేరు సంఘం సంయుక్త సహకారంతో ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



మట్టెవాడ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లి పందిరి.నెట్ మేరు/దర్జీ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వరంగల్ ఎల్లంబజార్‌లోని శ్రీరామ మేరు సంఘం భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు ఆదివారం(సెప్టెంబరు 29) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయో డేటా, ఫొటోలు వాట్సప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు. పూర్తి వివరాలకు 83744 45190, 80080 02165 సంప్రదించవచ్చు.

వ్యాన్ బోల్తా.. 13 ఆవుల మృతి

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల శివారులో శనివారం వేకువజామున ఓ వ్యాన్ బోల్తా పడడంతో 13 ఆవులు మృతి చెందాయి. మరి కొన్నింటికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి హైదరాబాద్‌కు వ్యాన్‌లో ఆవులను తరలిస్తున్నారు. అతివేగం కారణంగా వావిలాల శివారులోని మూల మలుపు వద్ద వ్యాన్ బోల్తా పడింది. వాహనంలో 51 ఆవులు, లేగదూడలు ఉండగా 13 ఆవులు మృతి చెందాయి. మిగతా ఆవులను పోలీసులు పాలకుర్తిలోని గోశాలకు తరలించారు. గాయపడిన ఆవులకు పశువైద్యాధికారులు చికిత్స అందించారు. వాహన చోదకుడు పరారీలో ఉన్నాడు. పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతి చెందిన ఆవుల విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుందని సమాచారం. సంఘటన స్థలాన్ని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, సీఐ మహేందర్‌రెడ్డి సందర్శించారు.

ప్రమాదకరంగా మలుపు: వావిలాల శివారులోని మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఈ నెల 3న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టగా.. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి



RAMOJI FILM CITY



సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

పదేళ్లు గడిచినా పాత సూచికలేనా!





తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటింది. ఉమ్మడి వరంగల్‌ను ఆరు జిల్లాలుగా విభజించారు. ప్రధాన రహదారులపై ఇంకా పాత బోర్డులే దర్శనమిస్తున్నాయి. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ వద్ద ప్రధాన రహదారిలో ఇలా ముగింపు, ప్రారంభం బోర్డులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరుమీదే ఉన్న చిత్రం ఇది.

– ఈనాడు, హనుమకొండ

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243



మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం

మండలంలోని కొర్లకుంట అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసే అంగన్‌వాడీ టీచరు, ఆయా గత జులైలో పదవీ విరమణ పొందారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని మూసివేశారు. దీంతో 8 మంది పిల్లలు ఇంటి దగ్గరే ఉంటూ పోషకాహారం పొందలేకపోతున్నారు. కొత్తవారిని నియమించి కేంద్రాన్ని తెరవాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మహాముత్తారం(భూపాలపల్లి జిల్లా)

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు..



కేటీకే ఓసీ-3 గనిలో నిర్వహించిన సమావేశంలో నాయకులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థ సాధించిన లాభాల విషయంపై కొన్ని కార్మిక సంఘాలు ఉనికి కోసం చేస్తున్న తప్పుడు ప్రచారాలను కార్మిక వర్గం నమ్మకూడదని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కేటీకే ఓసీ-3 గని ఆవరణలో ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐటీయూసీ పోరాటం ఫలితంగానే లాభాల వాటా సాధ్యమైందనే విషయాన్ని కార్మికులు గుర్తు పెట్టుకోవాలన్నారు. కొన్ని కార్మిక సంఘాలు చేస్తున్న అసత్య ప్రచారాలను కార్మికులు తిప్పికొట్టాలన్నారు. కార్మిక హక్కులు, సమస్యల పరిష్కారం ఏఐటీయూసీతోనే సాధ్యం అన్నారు. సమావేశంలో నాయకులు రమేష్, విజేందర్, రాంచందర్, చంద్రమౌళి, అజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి బకాయిలను చెల్లించాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: సింగరేణికి రావాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి, సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 1, 5ఇ గనుల్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన విధానాలను సింగరేణి యాజమాన్యం అమలు చేస్తున్నట్లు తెలుస్తోందని, దీంతో రాజకీయ జోక్యం పెరిగి, సంస్థకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే సంస్థ ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైందని బకాయిలు చెల్లించాలన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాలను పక్కదారి పట్టించి కార్మికులకు అన్యాయం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, రమేష్, శ్రీనివాస్, రత్నం, మహేందర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చండి



మాట్లాడుతున్న సాయిలు

రేగొండ, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం సీపీఎం మండల ప్రథమ మహాసభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాయిలు హాజరై మాట్లాడారు. భాజపా అధికారంలోకి వచ్చి పేదలకు ఇల్లు నిర్మిస్తామని చెప్పి ఇప్పటి వరకు మంజూరు చేయలేదని ఆరోపించారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నేతలు శంకర్, ఆదిరెడ్డి, కుమార్, లావణ్య, మంజుల, శిరీష, రాజయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

కాటారం, న్యూస్‌టుడే: స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బీ.లాలు శనివారం తెలిపారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బీ.అజయ్, ఎల్.చరణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 2 నుంచి హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ రాజేందర్, మాధవి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలి

గణపురం, న్యూస్‌టుడే: హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నేడు జరిగే తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని గణపురం మండలాధ్యక్షుడు శనిగరపు రాజేందర్ పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన కరపత్రాలను శనివారం గణపురంలో ఆవిష్కరించారు.

కోర్టు భవన సముదాయం తరలించొద్దని నిరసన

భూపాలపల్లి కలెక్టరేట్: కోర్టు భవన సముదాయాల స్థలాన్ని ఇతర ప్రాంతాలకు తరలించొద్దని భారాస మాజీ కౌన్సిలర్ రేనుక రాకేశ్ డిమాండ్ చేశారు. శనివారం భూపాలపల్లిలోని యాదవ కాలనీ, కారల్ మార్క్స్ కాలనీ ప్రజలు చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం భూపాలపల్లిని జిల్లాగా ఏర్పాటు చేసి జిల్లా కార్యాలయాలతో పాటు భూపాలపల్లిలో జిల్లా కోర్టుల భవన సముదాయ నిర్మాణానికి కారల్‌మార్క్స్ కాలనీ సమీపంలో 11.20 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. కొంత మంది ప్రజాప్రతినిధులు కోర్టు నిర్మాణ స్థలాన్ని గణపురం మండలం మైలారానికి తరలించేందుకు చూస్తున్నారని, అలాంటి ప్రయత్నాలను మానుకోవాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



చిట్యాల ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న జీఎస్సార్

చిట్యాల, న్యూస్‌టుడే: వైద్యులు, సిబ్బంది తమ విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. శనివారం చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి ఇన్‌ఛార్జి పర్యవేక్షకుడు శ్రీకాంత్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు అంకితభావంతో పనిచేయాలన్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తిరుపతి, మధువంశీకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట : దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, అలీమ్ కో కంపెనీ ఆధ్వర్యంలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల పరిధిలోని దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీకి ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 211 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య తెలిపారు. మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి, తహసీల్దార్ హేమ, ఐసీడీఎస్ సీడీపీవో అవంతిక, సూపర్‌వైజర్ జయప్రద పాల్గొన్నారు.

గీత కార్మికులకు రక్షణ కవచాల పంపిణీ

భూపాలపల్లి కలెక్టరేట్: రక్షణతో కూడిన మోకులతో గీతకార్మికులు తమ వృత్తిని నిర్వహించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం 75 మందికి ఎమ్మెల్యే గండ్ర చేతుల మీదుగా రక్షణ కవచాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ.. గౌడ సోదరులు ప్రమాదకర పరిస్థితిలో తాటిచెట్లను ఎక్కుతూ ప్రమాదాలకు గురైన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ప్రభుత్వం రక్షణ కవచాలను అందించడం మంచి విషయమని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ అభివృద్ధి అధికారి శైలజ, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ యువతకు స్ఫూర్తి



చిట్యాల కాకతీయ పాఠశాలలో..

చిట్యాల, న్యూస్‌టుడే: చిట్యాల మండల కేంద్రంలో శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భూక్యా నవీన్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సురేశ్, తోట దేవేందర్, కనుకుంట్ల అనీల్, అమర్, కాకతీయ పాఠశాల కరస్పాండెంట్ రాజ్ మహమ్మద్ పాల్గొన్నారు.

భూపాలపల్లి : జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో శనివారం భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్, రాకేశ్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ నాయకుడు జెరిపోతుల సనత్‌కుమార్ ఆధ్వర్యంలో యువకులు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మధు, రాకేష్, శ్రీకాంత్, రమేష్, సురేష్ పాల్గొన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు చంద్రగిరి శంకర్ ఆధ్వర్యంలో కార్మికులు నివాళులర్పించారు.



భూపాలపల్లిలో..

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన నాయకులు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒప్పంద, పొరుగు సేవల పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెంటర్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బందు సాయిలు, చెన్నూరి రమేశ్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక, పారిశ్రామిక విధానాలతో అన్ని రంగాల్లోని ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ. 26 వేలు అందించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, వెలిశెట్టి రాజయ్య, రమేశ్, రాజేందర్, రవికుమార్, బాబు, లక్ష్మి, రవి, చంద్రశేఖర్, తిరుమల, రాధమ్మ, పద్మ, రమేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు పెండెం మధుసూదన్ డిమాండ్ చేశారు. శనివారం టీఆర్‌టీయూ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్, కె.రవీందర్ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. డీఏను విడుదల చేయాలని, మెరుగైన పీఆర్సీ కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, మొగిలి, సాంబయ్య, మల్లికార్జున్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కాటారం : అసంబద్ధమైన ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ జీవో 25ను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూటీఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌నాయక్, గణేష్‌లు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం వారు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి నియమించాలని, ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి 20 మందికి ఇద్దరు ఉపాధ్యాయులు, ఆపై 20 మంది విద్యార్థులకు ఒక్కరి చొప్పున కేటాయించాలని, ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను విద్యావాలంటీర్లతో భర్తీ చేసి, డీఎస్సీ నియామకాలు చేపట్టాలని కోరారు.

దిష్టిబొమ్మ దహనం

భూపాలపల్లి, న్యూస్‌టుడే : నిత్యం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై అకారణంగా హైదరాబాద్‌లో కేసు పెట్టిన రెడ్డి జాగృతి దిష్టిబొమ్మను శనివారం భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో దహనం చేశారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ.. రెడ్డి జగృతికి చెందిన కొందరు వ్యక్తులు మల్లన్నను టార్గెట్ చేస్తూ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సరైన విధానం కాదన్నారు.

జనక్ ప్రసాద్ చిత్రపటానికి క్షీరాభిషేకం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: గతంలో ఎప్పుడు లేని విధంగా సింగరేణి సంస్థ సాధించిన లాభాల నుంచి కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చెల్లించేందుకు కృషి చేసిన ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ అధ్యక్షుడు జనక్ ప్రసాద్ చిత్రపటానికి స్థానిక సింగరేణి సెక్యూరిటీ కార్యాలయం ఆవరణలో శనివారం కాంట్రాక్టు సెక్యూరిటీ సిబ్బంది క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు జోగ బుచ్చయ్య, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహాముత్తారం, న్యూస్‌టుడే: మండలంలోని దొబ్బలపాడు ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో రసాయన శాస్త్రం(పీజీటీపోస్టు) బోధించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మహ్మద్ షరీఫ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ రసాయన శాస్త్రం, బీఈడీ భౌతికశాస్త్రం అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు సంప్రదించాలని కోరారు.

ముందస్తు బతుకమ్మ సంబరం



కాటారం, న్యూస్‌టుడే: స్థానిక వివేకానంద పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను శనివారం నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలను అందంగా అలంకరించారు. అందంగా అలంకరించిన బతుకమ్మలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం వందన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

సంక్షిప్తంగా

కాటారం, న్యూస్‌టుడే: గంగారం మోడల్ పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను శనివారం విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమానికి కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీ సాధారణమని, విధి నిర్వహణలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

దేశ రక్షణకు యువత కదలాలి

చిట్యాల, న్యూస్‌టుడే: దేశ రక్షణకు యువత ముందుకురావాలని ఎయిర్‌ఫోర్స్ అఫీషియల్ కార్పొరల్ సందీప్ అన్నారు. శనివారం చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీదేవి ఆధ్వర్యంలో అగ్నివీర్ వాయు(భారత వాయుసేన)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకంలో చేరేందుకు కావాల్సిన అర్హత, ఎంపిక విధానంపై వివరించారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి యుగంధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై డీఈవోకు వినతి

చిట్యాల, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఏబీవీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈవోకు జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోల్కొండ సురేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయని, చిట్యాల మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సీ) పాఠశాలలో 50 మంది విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను కేటాయించలేదన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజల మౌలిక సదుపాయాలతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం పురపాలక సంఘం పరిధిలోని కాశీంపల్లి, జంగేడు, పట్టణంలోని జవహర్‌నగర్, కుందూరుపల్లి, పుల్లూరిరామయ్యపల్లిలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.88 కోట్లతో సీసీ రోడ్డు, అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు.

ఆకట్టుకున్న కళా ఉత్సవ పోటీలు



చిట్యాలలో..

చిట్యాల, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల స్థాయి కళా ఉత్సవ పోటీలు ఆకట్టుకున్నాయి. 8 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు అలరించినట్లు ఎంఈవో కోడెపాక రఘుపతి తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కృష్ణ, ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బిక్షపతి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రఘుపతి, వేణు పాల్గొన్నారు.

కొత్తపల్లిగోరి(రేగొండ) : విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలని ఎంఈవో చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత అధ్యక్షతన కళా ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన 7 అంశాలను పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కొత్తపల్లిగోరి, చిన్నకొడపాక, జగ్గయ్యపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు.

రామప్పలో విద్యార్థుల సందడి



చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రపంచ టూరిజం డే పురస్కరించుకుని శనివారం రామప్ప దేవాలయం, కోటగుళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీదేవి కాకతీయుల కళా వైభవం గురించి విద్యార్థులకు వివరించారు. రామప్ప దేవాలయం చారిత్ర, యునెస్కో గుర్తింపు అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి యుగంధర్, అధ్యాపకులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, చిట్యాల

క్రికెట్ టోర్నీ ప్రారంభం



కాటారం, న్యూస్‌టుడే: ధన్వాడలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీపాద స్మారక డీపీఎల్-9 క్రికెట్ టోర్నమెంట్‌ను దుద్దిళ్ల శ్రీనుబాబు శనివారం ప్రారంభించారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. టీషర్ట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు చీమల సందీప్, పంతకాని సమ్మయ్య, దేవేందర్‌రెడ్డి, అశోక్, మహేశ్వరి, రమేష్, తిరుపతిరెడ్డి, రవీందర్‌రావు, రవి, మహేష్ పాల్గొన్నారు.

గుర్రం జాషువా జయంతి

కాటారం, న్యూస్‌టుడే: ధన్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల కేంద్రంలోని జయశంకర్ సరస్వత సమితి ఆధ్వర్యంలో శనివారం మహాకవి గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిన్నతనం నుంచే సమసమాజ నిర్మాణానికి నవయుగ చక్రవర్తిగా జాషువా పేరుగాంచారని, పలు రచనలు చేసి బిరుదులు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపకుడు గడ్డం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శరత్‌బాబు, పర్వీన్, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ కార్మికులకు నైపుణ్య శిక్షణ

కాటారం, న్యూస్‌టుడే: పల్లెల్లో మిషన్ భగీరథ పనుల నిర్వహణకు పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం నైపుణ్య శిక్షణ ప్రారంభించారు. భగీరథ పనుల మరమ్మతులు, ప్లంబింగ్ పనులపై అధికారులు శిక్షణ అందించారు. మరో మూడు విడతల్లో చేతి పంపులు, ఎలక్ట్రిషియన్, నీటి నాణ్యత పరీక్షలపై అవగాహన, శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, డీఈ రమేష్, ఏఈ రాజశేఖర్, గ్రిడ్ ఏఈ కళ్యాణ్ పాల్గొన్నారు.

కేటీపీపీ ఉద్యోగుల నిరసన

చెల్పూర్, న్యూస్‌టుడే: రామగుండంలో నూతనంగా నిర్మించే థర్మల్ విద్యుత్తు ప్లాంటును జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీఈజేఏసీ) ఆధ్వర్యంలో కేటీపీపీ ఎదుట ఉద్యోగులు చేపట్టిన నిరసన శనివారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కేటీపీపీ ఉద్యోగులు మాట్లాడుతూ.. రామగుండంలో నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటులో సింగరేణి భాగస్వామ్యాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. టీజీ జెన్‌కో ఆధ్వర్యంలోనే ప్లాంటు నిర్మించేలా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీపీఈజేఏసీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రాణాలను బలిగొంటున్న గుడుంబా

పలిమెల, న్యూస్‌టుడే: పలిమెల మండలంలో నాటు సారా తయారీ విక్రయాలు విచ్చల విడిగా కొనసాగుతున్నాయి. గుడుంబాకు బానిసై పలువురు ప్రాణాలను కోల్పోతున్నారు. పలిమెలకు చెందిన జనగామ రమేష్(40) శుక్రవారం గుడుంబా తాగి ఇంటికి వెళ్తుండగా స్పృహ తప్పి రహదారిపై పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించిన మహాదేవపూర్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తేర్కరి శంకరయ్య(45) నాలుగు రోజుల క్రితం గుడుంబా తాగి ఇంట్లో మృతి చెందాడు. నాలుగు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి చెందడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గుడుంబాతో కుటుంబాలు చెదిరిపోయి పిల్లలు అనాథలుగా మిగిలిపోతున్నారు.

పోలీస్ యోగా పోటీల్లో ప్రతిభ



మధు

కాటారం, న్యూస్‌టుడే: కాటారం డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎడ్ల మధు కోచ్‌గా వ్యవహరించిన తెలంగాణ పోలీస్ బృందం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ యోగా ఛాంపియన్ షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. విధులు నిర్వర్తిస్తూ యోగా ప్రావీణ్యం సాధించిన మధు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. 2018 లో ముంబైలో జరిగిన సౌత్ ఏషియన్, 2022లో పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో ఇతడి పర్యవేక్షణలో బంగారు, రజత పతకాలు సాధించారు. 2024 ఫిబ్రవరిలో మహారాష్ట్ర నాగపూర్‌లో జరిగిన పోటీల్లోనూ రజత, కాంస్య పతకాలు సాధించేలా శిక్షణ ఇచ్చారు. వివిధ పతకాలు సాధించేందుకు కృషి చేస్తున్న మధును పలువురు అభినందించారు.